# నా స్వర్గలోక యాత్ర

కె. వి. యల్. నరసింహారావుగారు, బి.ఏ.

నాకు కవిత్వం అంటే భలేయిష్టం. ఇష్టమేకాదు; వ్యసనంకూడా. అందులో భావకవిత్వం అంటే పడి చచ్చిపోతాను. భావగీతాలు వింటానికి చెవులు తెగ్గోసుకుంటా. కళ్లు చిల్లులడేలాగ పత్రికల్లో చదువుతుంటా. ఏ భావకవన్నా టౌన్‌హాల్లో గీతాలు పాడుతాడని తెలిసిందా ముందు వెళ్లేది నేను. కవి తరువాత నేనే ఆనందించేది ఆపద్యాన్ని. రోజూ వకగంటైనా పఠనచేసి పరవశుణ్ణైపోతే గాని, నాకు తోచదు. కాసేపు విరహగీతాల్లో మరిగిపోతాను. యెంకి, నాయుడు బావతో కొండెక్కుతున్నానంటే, నావల్లు నాకు తెలియదు. కొంతసేపు మలయపవనునితో కలసి గోదావరీ అలల కొనలమీద నాట్యంచేసి, ఆపడంగా రివ్వున దుమ్ముతో ఆకాశంలోకి వెళ్లి, స్వేచ్ఛగా తిరిగి, గభాలున క్రిందపడిపోతాను. ఒకప్పుడు నా హృదయం పక్షిలాగ కొండలెక్కి, సముద్రాలు దాటి, యెక్కడికో వెళ్లిపోతుంది. పాతాళలోకంల్లో యిరుకుసందులందు కొట్టుకులాడుతుంది వకప్పుడు.

ఇంతకు చెప్పబోయేదేమిటంటే? ఆనాడు వైకుంఠయేకాదశి. స్వర్గలోకం తలుపులన్నీ తెరిచి వుంటయిట. పాపాత్ముడైనా ఆనాడు కాలంమూడి చచ్చాడంటే నిర్భయంగా స్వర్గాని కెళ్లచ్చు. ఢోకా లేదు దీనికి. అడిగేవాడుండడెవడు! ఆత్మహత్య చేసుకున్నా అడ్డంలేదు.

ఆరోజున యెండవేతనో నబ్బా! బాగా అలసట మీదున్నాను. ఉపవాసాలని ఆడవాళ్లు ఫలహారాలు చేసుకుంటారుగా! అవన్నీ మస్తుగా తిన్నాను. ఆరాత్రి వకగంట భావగీతాలు పారాయణచేసి, దుప్పటి శవంలాగ కప్పుకొని కాళ్లునిగడదన్ని పడుకున్నా. ప్రాణం యెక్కడికిపోయిందో? నావల్లు నాకు తెలియదు.

ఒకగమ్మత్తు కలొచ్చింది. నేను బొందితోనే స్వర్గానికి ప్రయాణం చేస్తున్నా. దోవలో చాలా యాతనపడ్డా; ఒక్కణ్ణి; భయం; అంతా అంధకారం; ఏమిచెసేదీ? టార్చిలైట్ (Torch light) వేసుకుని మెల్లగా చచ్చిచెడి చాయంగల విన్నపములని వైతరణీ నదివొడ్డున చేరాను. అబ్బా! అంతా చీమూ, నెత్తురూ! అది దాటేదెల్లాగా? నేను చచ్చిపోయుంటే మావాళ్లు గోదానాలు చేసేవారు; ఆ ఆవుతోక పట్టుకొని దాటేవాణ్ణి. ఇప్పుడెల్లాగా? అక్కడ పుణ్యాత్ములను దాటించడానికి వకడున్నాడు. వాడూ యీమధ్య లంచాలు మరిగేట్ట. వాడి కేదో యిస్తానని అవతలొడ్డుపడ్డా. అక్కడి నుంచి యకాయికీని వెళ్లిపోయాను స్వర్గానికి.

అమితదాహం అయింది నాకు. నాలుక పీక్కుపోతున్నది. సోడా దొరుకుతుందేమోనని అటూయిటూ చూచా. ఏమి పికరులేదు. ఇంతలో వక చక్కని కొలను కనుపించింది. దిగటాని కెవరన్నా చూస్తారని భయం. ఎవరూలేకుండా చూసి కాసిని మంచినీళ్లు పుచ్చుకున్నా. తస్సదియ్యా! అమృతంలా వుంది. బడలిక వదిలింది కాస్త. ఇక స్వర్గాన్ని చూడాలిగా? ఒక వీధిన పడిపోతూయుండగా వకచోట పొయట్స్ బ్లాకు (Poets' Block) అని వుంది. ఓహో! మన ఆంధ్రకవులంతా యిక్కడుంటారు గామాల్సని లోపలికెళ్లాను.

ఆహా! నా భాగ్యమేమి! కవులంతా స్నానసంధ్యానుష్టానాలు తీర్చుకొని ఫలహారాలు తయారయ్యేలోపల ఆధునికకవులనుగూర్చి మాట్లాడుదామని వక చిన్నసభ చేస్తున్నారు. నాకు వాళ్లమీద భక్తిశ్రద్ధలున్నా, భావకవులమీదుండే అభిమానంచేత యేమి జరుగుతుందో చూద్దామని చాటుగా చతికిలపడ్డా.

నన్నయ, పోతన, శ్రీనాథుడు, తిక్కన, పెద్దన మొదలైనవారంతా అలంకరించారు సభను. నన్నయ్యగారు అధ్యక్షుడు. సభ ప్రారంభించారు.

అగ్రాసనాధిపతి లేచి మొదలెట్టాడు వుపన్యాసాన్ని. సారాంశం యిది.

"కవి సోదరులారా! మనం యిక్కడెందుకు సమావేశమయిందీ మీకు తెలియును. మన యావజ్జీవాలు ధారపోసి మనశక్తి కొలదీ ఆంధ్రభాషను పోషించి, ఆంధ్రభాషావధూటికి చెక్కుచెదరని సొమ్ములు పెట్టేం. భావకవులంటూ యీమధ్య కొంతమంది బైలుదేరి భాషనంతా చెడగొడుతూ యున్నారు. ఈ రోజుల్లో ప్రతివాడూ కవిత్వం చెప్పేవాడే. లఘువులు, గురువులు గుర్తించటం తెలియగానే కవిత్వం చెప్పటం మొదలుపెట్టాడన్నమాటే. ఎక్కడ చూచినా వీరి పుస్తకాలు—పుస్తకాలుమట్టుకు అందంగావుంటయి. వాళ్లకు కవితాధార సున్న. పూర్తిగా వక పద్యమూ వుండదు. సగం వ్రాశాక, కవి భావప్రవాహానికేదో అడ్డు తగిలి ఆగిపోతుంది. చుక్కలుంటాయక్కడ. బుర్రపగలగొట్టుకున్నా కవి హృదయం తెలియదు గదా! ఎవరన్నా దీని అర్థం యేమిటని కవి నడిగితే, "నీ మొహం అర్థం ఏమిటి? కవి యెంతసులభంగా చెప్పకలడో అలా తన భావాన్ని వ్రాశాడు. ఆలోచించు నీకే తెలుస్తుంది. తెలియకపోతే "అఘోరించు" అంటాడు. యతిప్రాసలమాట చెప్పక్కర్లేదు. అన్నీ బూతులే! కవికి ఆమాత్రం స్వేచ్ఛ వుండాలిట. శైలి చూద్దామంటే అదీలేదూ, భాష లేనిదే శైలి యెల్లావస్తుంది. విరహం, ప్రణయం, మోహం, గాలి, ధూళి, పొగ, పిల్లవాయువులు—యివి కవితాసామాగ్రి. ఇలాంటి చొప్పదంటు కవిత్వం అడివిలాగ పెరిగిపోతున్నది. వీళ్లలో చక్కని కవిత్వం వ్రాసేవాళ్లువున్నారు కొంతమంది. వాళ్లసంగతి మన కక్కరలేదు. స్వేచ్ఛగా యిష్టమొచ్చినట్లు వ్రాసేవారి సంగతి ఆలోచించాలి. నయానో, భయానో మంచి మార్గాన పెట్టాలి. కాబట్టి మీరంతా ఆలోచించి యేదోమార్గం చెప్పాలని కోరుచున్నాను" అని కూర్చున్నాడు

ఇంతలో భీమకవి కళ్లెర్రజేసి "దాని కింత ఆలోచనెందుకండీ! బాబూ, నాయినా అంటే వాళ్లు వింటారా? మీ అందరి అనుజ్ఞ అయిందంటే వక పద్యం చెప్పేస్తా. ఎక్కడి భావకవులూకూడ యెగిరిపోతారు. ఖాళీబుర్రలతో భావాలకోసం ఆకాశంచూస్తూ కవిత్వంవ్రాసే అధునికకవులంతా. చేతిలో కలాలు జారవిడిచి, అలాగే కొయ్యలై పోతారు" అన్నాడు.

దొంగతనంగా యిదంతా వింటున్న వాణ్ణి ఊరుకోక, నేనేదో మనగాణ్ణని ముందరికెళ్లి "అయ్యా! మీరంతా పెద్దలు; అంత తొందరపడటం మంచిది కాదు. వాళ్లేదో నూతన ఫక్కీమీద కవిత్వం వ్రాస్తున్నారు. తప్పులుంటే సలహాలిచ్చి మరమ్మతు చేయండి. అదిలేకుండా చంపుతామంటే నా కేమీ బాగాలేదు. చంపితే జైల్లోపెడ్తా"రని అన్నా.

భీమకవి ఆపళంగా గబగబ నామీదికురికాడు. ఆమనిషిని చూసేసరికే నా ప్రాణాలు యెగిరి పోయాయి. "అబ్బాయి! ఎందుకొచ్చావిక్కడికి? అవతలికెళ్లిపో" అని మర్యాదగా చెపితే వెళ్లిపోనూ? అందరూ చూస్తూనే వూరుకున్నారు. ఆయనంటే భయమేమో వాళ్లకు! నన్ను చెవులు పట్టుకు లేవదీసి మెడమీద వక్కటిచ్చాడు. "చచ్చానురా......బాబో!" అని కేకపెట్టా. మా అమ్మ విని నిద్రలేపి ఏమిటన్నది. కలవరించానన్నా.

